కథానిక

# ఆచార్య దేవో భవ!

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

రాజారావు రాత్రి తొమ్మిదింటిదాకా రాస్తూనే ఉన్నాడు. మధ్యమధ్య ఆగుతూ ఆలోచిస్తూ ఏదో రాస్తూండడం అతనికి అసలు అలవాటులేని పని. తైలధారలాగ ఆగకుండా సాఫీగా నడుస్తోందతని కలం.

అదీకాక, రాత్రి ఎనిమిది దాటాక అతను ఆఫీసుపని చేసే మామూలులేదు. వేదవల్లి ఏడున్నరనించీ అతనికోసం ఎదురు చూస్తూనే ఉంది. న్యూస్ పేపరులో ప్రతీ హెడ్డింగూ, అడ్వర్టైజ్‌మెంటూ విడువకుండా చదివినా రాజారావు వ్రాతపని పూర్తవలేదు. ఎన్నిసార్లని ఆమె ఆ పేపరు విసుగ్గా పారవేసి రెండు నిముషాలు గడిచాక మళ్లా పరీక్షిస్తూ కాలంగడుపుతుంది? పోనీ రాసేవంత అర్జంటైతే పగలే వ్రాసుకోకూడదూ?

ఆమె ఓర్పు క్రమంగా తగ్గిపోతూంది. గడియారం నిర్విరామంగా పని చేస్తూంది. ప్రతీ నిముషంలో సెకండ్లనీ లెఖ్ఖపెడుతూ ఓర్చుకోబోయిందామె. కాని మూడు నిముషాలు లెఖ్ఖపెట్టేసరికే ఆమెకి గంట గడిచిపోయింది. గడియారం తొమ్మిదిన్నర చూపుతూంది.

మంచం వదలి అతని డ్రాయర్ వెనక్కి వెళ్ళి అతనికి కనపడకుండా వ్రాతని ఆమె పరిశీలించసాగింది. పొద్దుట విజిట్ చేసిన బడి మీద రిపోర్టు రాస్తున్నాడు రాజారావు. తాను వెళ్లేసరికి బడిలో హాజరు లేదనీ, ఉపాధ్యాయుడైనా కబురు పంపితేగాని రాలేదనీ, పదిగంటలయేసరికి పోగైనా కొద్దిమందికీ ఏమీ రాదనీ, ఆ ఊరినించి ఆ ఉపాధ్యాయుణ్ని బదిలీచేస్తేగాని ఆ బడి బాగుపడదనీ "ఘాటుగా" వ్రాస్తున్నాడు రాజారావు.

వల్లి అంతా చదివింది. ఆమెకి ఇంగ్లీషు బాగా వచ్చును. ఎటువంటి ఉద్రేకంతో భర్త ఆ రిపోర్ట్ రాశాడో ఆమె గ్రహించుకొంది.

మరో పావుగంటకి అతను గాథ ముగించి బద్ధకంగా ఒళ్లువిరుచుకుని "చాలా టైం అయిందే!" అంటూ దీపం తగ్గించాడు.

మరో అయిదునిమిషాలు వల్లి ఏమీ మాట్లాడలేదు. తరువాత ఆమె అడిగింది. "ఉదయం బడి అంత అధ్వాన్నంగా ఉందా?"

"అధ్వాన్నమేమిటి! వెళ్లేసరికి పిల్లలులేరు. మాస్టరు లేడు. నేను పిలిపించాను అతన్ని బడికి. పదయేసరికి పదిమంది పిల్లలు. ఎవడికీ ఏమీరాదు. గవర్నమెంటు డబ్బు దండగకంటె ఏమీలేదు ఆ బడి-"

"అందుకేనా అంతగా రాశారతన్ని బదిలీ చెయ్యమని?"

"మరేం చెయ్యడం అంతకన్న గట్టిశిక్ష లేనప్పుడు?"

"మరి- ఆ కొత్తబడిలో మట్టుకు ఇతను ఇంతకంటె బాగా పనిచేస్తాడని నమ్మకం ఏమిటి?"

"శిక్ష కదూ- భయంవల్ల పని చేస్తాడు."

మూడు నిమిషాలు మెల్లిగా గడచాయి. మళ్ళా వల్లి—

"మీ జీతం ఎంతండీ ఇప్పుడు- ఇవాళ ఏదో ఎక్కువ అలవెన్సు ఇచ్చినట్టున్నారు?"

"మరో అయిదు రూపాయిలు అలవెన్సు ఇచ్చేరు. మొత్తం నూటఎనభై అందుతాయి."

"మరి- మాస్టర్‌కెంత ఇస్తారండీ?"

"ముప్పై- ఇరవై- ఏభై ఇస్తారు-" చాలా రాత్రయింది. ఈ బాతాఖానీ దేనికి! పడుకో."

వల్లి ఏమనుకుందో మళ్ళీ మాటలాడలేదు.

* * *

రాజారావు కుర్చీమీద కూర్చునేసరికి క్లాసులో ఉన్న అయిదుగురు పిల్లలూ లేచి నిలువబడ్డారు... హాజరుకోసం తాపత్రయ పడవలసిన రోజది. పట్టణంలో డి. యి. ఓ. కేంప్ చేశాడు.

చిరాగ్గా హాజరు పుస్తకం తీసి పేర్లు చదువుతూ పిల్లల్ని అడుగుతున్నాడు..."సూరిగాడు రాలేదురా !"

పిల్లలు సమాధానం చెప్పారు..."వాడికి చల్లి లేదుటండీ...రాలేదట."

"రామిగాడో ?"

"గొర్రెలవెంట పోయాడుటండీ."

మరికొన్ని పేర్లు చదివాడు చికాకుగా.

'సూర్యనారాయణో ?"

"వాళ్లమ్మకి జ్వరంటండి."

"పోసీ మునసబుగారమ్మాయిని పిలవండి."

"ఇంట్లోకి చుట్టాలు వచ్చారట పంపరటండీ యీ వారం."

రాజారావుకి చాలా కోపం వచ్చింది. కాని ఎవరిని ఏమిటి అనగలడు ! తాను స్వయంగా వెళ్లి ప్రాధేయపడినా సరే- వచ్చే సమాధానాలవే. పోసీ డిఫాల్టర్లుగా వేద్దామంటే ఒక్కడికీ కట్ట బట్టా తినడానికి తిండీ లేదు. జరిమానా లేమిటిస్తారు పాపం ! తన పిల్లలే శుభ్రమైనవో కానివో చిరుగులులేని బట్టలు లేక బడి మానుతున్నారు. ఒకపూట తిండి మానుకున్నా మరో పూటేనా కడుపు నింపడం లేదు వచ్చే ఏభై రూపాయిల జీతం. పూటబత్తెం పుల్లవెలుగులతో నోరు అతుక్కుని సంసారం సాగించే బీదవాళ్లకి తానే మనస్సుతో జరిమానా వేయిస్తాడు ?

బడి వెలుపల జట్కా ఆగింది. డి.యీ.వో., ఇన్‌స్పెక్టరూ, జవానూ దిగారు. ఉన్న ఆరుగురితోనూ హడావిడిగా ఎంటెండెన్సు పూర్తిచేసి వాళ్ళకి స్వాగతం ఇవ్వడానికి నీరసంగా బరిగెట్టాడు రాజారావు కబళంలేని కడుపుతో.

బడిలోనికి వచ్చారు ఆఫీసర్లిద్దరూ. వస్తూనే ఇన్స్పెక్టర్ కుర్చీ చూపాడు డి. యీ. వో. గారికి. తను ఒక బెంచీమీద కూర్చున్నాడు.

కర్కశంగా అన్నాడు ఆఫీసరు-"ఏమయ్యా నీ బళ్లో హాజరు ఏమీ లేదట. ఇన్స్పెక్టరు ప్రతి విజిట్లోనూ రాస్తూనే ఉన్నాడు. పాతికమందికి ఆరుగురేనా హాజరు ?"

రాజారావు తల గిర్రున తిరిగింది. సగం నీరసంతోటీ సగం పరిస్థితులవల్లా జవాబు చెప్పలేక పోయాడు.

మళ్ళా అన్నాడు ఆఫీసరు "బడికి తోట ఏదీ? బోధనకి అపరేటస్ ఏమిటి తయారు చేశావ్?"

రాజారావు బుర్ర తడుముకున్నాడు. తిండి లేనివాడు తోటపెంచాలి-అపరేటస్ తయారు చెయ్యాలి.

ఏవేవో ప్రశ్నలు వేశాడు ఆఫీసరు. దేనికీ తాను సమాధానం చెప్పలేదు. చివరికి ఇద్దరూ లేస్తూ "ఆఫీసర్‌ని మర్యాద చెయ్యడం కూడా తెలీదేం నీకు ? ట్రాన్స్ఫరు కాకపోతే నీపని బాగుపడదు" అని బడినించి నిష్క్రమించాడు.

రాజారావుకి ఒకవంక ఆర్థాకలితో అటమటలాడే భార్యా, అయిదుగురు పిల్లలూ కనపడ్డారు. దీనంగా చూస్తూ మరోవైపు పిల్లలని బడికి పంపని తల్లి దండ్రులు కనబడ్డారు. ఇంకోవైపు బడి తోటా, చక్కటి అట్టలూ, బోధనా పరికరాలూ కనబడ్డాయి.

ఒకవంక ఆఫీసర్ కోపగిస్తూ తనకి బదిలీ చేయిస్తానని బెదిరిస్తున్నాడు. ఇంటిదగ్గర కడుపు నిండని చిన్నమ్మాయ్ అన్నంకోసం ఏడుస్తూంది. ఎంత జ్వరంతోనూ జంకక సూలువడుకుతూ భార్య రోజుకి బేడ అర్జిస్తోంది.

లోకం కాబోలుకూస్తుంది. "ఎద్దులమల్లే ఎదిగిన వాళ్లకి పెళ్లిచెయ్యక."

వారమో, నెలో, గడిచింది.

రాజారావుకి బదిలీ ఆర్డరు వచ్చేసరికి అతను మరీబాధ పడ్డాడు- ఇంటిఅద్దె, పిల్లలు, వెధవ ఉద్యోగం. కాదు-వెధవజీవితం.

* * *

రాజారావు కాఫీ త్రాగుతూ రాత్రికల నెమరు వేసుకుంటున్నాడు. వల్లి మెడలో మెరుస్తున్న గొలుసువైపు చూస్తున్నాడు.

"నూట ఎనభై. ఏభై !"

ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటది?" అంది వల్లి.

రాజారావు నెమ్మదిగా డ్రాయర్‌దగ్గరకి పోయి రాత్రి కష్టపడి వ్రాసిన కాగితంతీశాడు-చింపాడు. ముక్కలుగా నక్షత్రాలక్షే చిన్న ముక్కలుగా-చాలా చిన్నముక్కలుగా.

మళ్లా అడిగింది వల్లి- "ఏమిటది"?

పరధ్యానంగా తనన్నాడు "అదే-అది."